# వి.డి.ఆర్.ఎల్

ఒకటా.....రెండా.....నాలుగు నెలల నుంచీ బాధ. తలనొప్పో...గుండె నొప్పో...నడుం నొప్పో అయితే ఎవరికైనా చెప్పుకునేది. కానీ ఇది ఎవరికీ చెప్పుకోనిచ్చేట్టు లేదు. శరీరానికి సంబంధించిన రోగమే కదా. అయినా చెప్పుకోలేక పోతోంది. ఎవరికైనా చెప్పాలి. ఎవరికి?... ఆలోచిస్తూ డాబాపై వడియాలు ఆరబోస్తున్న నాగమణి "ఇంకా కాలేదా?" కింద నుంచి అత్తగారి కేక వినిపించగానే "ఆఁ ఆఁ! అయిపోయింది. వచ్చేస్తున్నాను"అంటూ త్వరత్వరగా వడియాలు ఆరబెట్టి ఖాళీ అయిన బేసిన్‌ని పట్టుకుని కిందికి దిగుతూ 'అత్తయ్యకి చెపితే' అనుకొంది.

"కాస్త ఆ పప్పులుసుకి తిరగమోత పెట్టు. సినిమా వచ్చే వేళయింది" అంటూ వర్ధనమ్మ హాల్లోకి వెళ్ళింది.

నాగమణి బేసిన్‌ని అంట్లగిన్నెల్లో పడేసి చేతులు కడుక్కుని పొడిబట్టతో తుడుచుకొంది.

పోపులపెట్టె తీసింది. స్టవ్‌పై కాద మూకుడు పెట్టి స్టవ్ వెలిగించింది. నూనెపోసి పోపు గింజలు వేసింది. కరివేపాకు వేస్తుంటే ఆకులకి వున్న

నీటి చుక్కలు వేడినూనెకి తగలగానే నూనె తుళ్ళి బుగ్గ మీద వో చుక్క చేతుల మీద కొన్ని చుక్కలు పడ్డాయి. ఆ వేడికి నాగమణి "అబ్బా" అంది.

"ఏమయింది" టి.వి. స్విచ్ ఆన్‌చేసి సినిమా ఛానల్‌ని ట్యూన్ చేస్తున్న వర్ధనమ్మ అరిచింది.

"ఆ ఏం లేదు. నూనె తుళ్ళింది" అప్పటికే చర్మపు మంట తగ్గిన నాగమణి తేలిగ్గా అంది.

టి.వి.లో రాజేంద్రప్రసాద్ సినిమా వస్తూంది.

వర్ధనమ్మ నవ్వు మొహంతో సినిమా చూస్తోంది. ఆవిడకి రాజేంద్రప్రసాద్ సినిమాలంటే మహా ఇష్టం. ఇప్పుడు ఈ విషయం చెప్పి ఆమె నవ్వుని ఎగరగొట్టడం ఎందుకులే అనుకుంది నాగమణి.

అసలు ఇలాంటి బాధలు ఎవరికైనా వస్తాయా? నాకే వచ్చాయా? అనుకొంటూ ఇస్త్రీ చెయ్యాల్సిన బట్టలు కుప్పపోసి ఐరన్ బాక్స్ ప్లగ్ పెట్టి స్విచ్ ఆన్ చేసింది.

శేషగిరి చొక్కాలు ఇస్త్రీ చేయడం అవుతుండగా "అమ్మాయ్ కంచంలో అన్నం పెట్టి ఇక్కడికే ఇచ్చై. సినిమా చాలా బాగుంది" నాగమణికి వినిపించేలా కేకేసింది వర్ధనమ్మ.

స్విచ్ ఆఫ్ చేసి వంటింట్లోకి వెళ్ళింది నాగమణి. నొప్పితో త్వరగా నడవటానికి వీలుకావడం లేదు. నిండా ముసుగు పెట్టి పడుకోవాలని వుంది. వేళకానివేళ నిద్రేంటంటే ఏం చెప్పాలి?

వడ్డించిన కంచం వర్ధనమ్మకి అందించింది. మంచినీళ్ళు పెడుతూ 'ఇప్పుడు చెపితే'?

"చీరల వాడొచ్చాడు" అంటూ పక్కింటావిడ వచ్చింది.

తినటం పూర్తి చేసి చీరలనీ సినిమానీ మార్చి మార్చి చూసేస్తూంది వర్ధనమ్మ. నాలుగు నెలలుగా పడుతున్న బాధని చెప్పాలంటే ప్రతిసారి ఏదో ఒక అడ్డే. మొదటిసారి వచ్చినప్పుడు అదేపోతుందిలే అనుకొంది. రెండవసారి వచ్చినప్పుడు చెప్పటానికి మొహమాటం, సిగ్గు. వాటిని పక్కకి పెట్టి చెపుదాం అనుకునేలోగా శేషగిరి వూరు వెళ్ళాడు. మూడోసారి

వచ్చినప్పుడు ఇంట్లో చుట్టాలు వున్నారు. ఇది నాలుగోసారి ఇలా బాధపడటం. ఈసారైనా చెప్పటం అవుతుందా?

అత్తగారికి తెలియకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. బాగా చదువుకున్న శేషగిరి మూర్ఖత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు నాగమణికి.

నాలుగోరోజు బ్లీడింగ్ అవుతుంటేనే 'అందరూ మూడు రోజులే అంటారుగా! నీకేంటి నాలుగు రోజులు అవుతుంది? ఇదేం రోగం? నాకే దొరకాలా యిలాంటి రోగమున్న పెళ్ళాం' కంట్రోల్ చేసుకోలేని శారీరక కోరికలతో శేషగిరి తిట్టే తిట్లు, ప్రతి నెలా గుండెని పొడిచే తూట్లు ఇంకా పచ్చిగా బాధిస్తూనే వున్నాయి. ఇప్పుడు ఈ విషయం చెపితే ఏమంటాడో, ఇంతకీ ఇదే రోగమో? ఆలోచిస్తున్న నాగమణి ముఖం కాకరపు వ్వొత్తిలా వెలిగింది.

చప్పున పుస్తకాల షెల్ఫ్ దగ్గరికి వెళ్ళింది. లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ పాత సంచికలు బయటకి తీసింది. ఒక్కో సంచిక అందుకుని అందులో దాంపత్య జీవనం శీర్షిక తీసి, ప్రశ్నలు చదవడం మొదలు పెట్టింది. ఒక్కటీ తన జబ్బేంటో చెప్పలేక పోయాయి.

"ఇంకా పుస్తకాల ముందే వున్నావా? పేరంటానికి వెళ్ళాలిగా" మధ్యాహ్నపు నిద్ర నుంచి లేచిన వర్ధనమ్మ అంది.

"ఆ ఆ! అయిపోయింది. వెళతాను" అంటూ ఆ పుస్తకాలు తిరిగి లోపల పెట్టేసి వర్ధనమ్మకి టీ చేసి యిచ్చి గదిలోకి వచ్చింది. బీరువా తీసింది.

పట్టు చీరలు, జరీ చీరలు, గార్డెన్, విమల్ - మెత్తమెత్తని చీరలు. తను పోతే ముచ్చటైన చీరలన్నీ ఎవరు కట్టుకుంటారు? అత్తయ్య ఈ చీరలన్నీ వదినగారికి యిచ్చేస్తుందేమో? అమ్మ కొన్న చీరలు కదా, అమ్మకి తిరిగి ఇస్తే చెల్లాయికి పనికివస్తాయి కదా!

"ఏంటి ఇంకా అలానే వున్నావా? తయ్యారు కాలే" గద్వాల పట్టుచీర పయిట అంచుల్ని సర్దుకుంటూ వచ్చిన ఎదురింటి ప్రమీలని చూసి "ఆ ఆ అయిపోయింది" అంటూ పట్టు చీరని గబగబా నడుముచుట్టు తిప్పి

కుచ్చెళ్ళుపోసి కట్టుకుంది. ఎన్నెన్ని కలలు. ఇదే చీరతో పెళ్ళి కూతుర్ని చేసి బుగ్గన చుక్క నుదుట కళ్యాణ తిలకం పండిన గోరింట చేతులు- ఏది ఆ అలంకరణంతా! ఆఖరి పేరంటమా? ఛీ ఛీ ఏమిటిదంతా. ఇంత బేలతనమా?

కళ్ళల్లో వుబుకుతున్న నీటిని ఆపటానికి ప్రయత్నిస్తు తనని తాను మందలించు కుని ప్రమీల వెంట పేరంటానికి బయలుదేరింది.

ఎటు చూసినా కళకళలాడిపోతూంది పేరంటపు ఇల్లు. ఎంత అదృష్టవంతులు వీళ్ళంతా. అలా అనుకోడానికి లేదేమో. తన చీర ధగధగలు, తన నవ్వు చూసి తనకి ఓ చెప్పుకోలేని సమస్య వుందని ఎవరైన అనుకుంటారా?

చీరెంత ట్రాన్స్‌పరెంట్ అయినా గుండెలో విషాదాన్ని చూపించదు కదా!

పేరంటం నుంచి ఇంటికి వచ్చింది. అత్తగారు అడిగిన పేరంటం విశేషాలన్నీ ముక్తసరిగా ఏకరువు పెట్టింది.

అప్పటికి శేషగిరి ఇంటికి వచ్చి స్నానంచేసి గాంధీచౌక్ వరకు వెళ్ళి స్నేహితులతో కబుర్లు ముగించుకొని వచ్చాడు. అతనికి వడ్డించింది. అతను తిని గదిలోకి వెళ్ళి పక్కమీద వాలిపోయాడు. వంటిల్లు చక్క బెట్టుకుని నాగమణి గదిలోకి వెళ్ళి పక్కపై వాలింది.

రకరకాల ఆలోచనలతో ఆమెకి నిద్రపట్టలేదు. సుగుణ పెళ్ళి అయ్యాక వెళ్ళి పోతుంది కదా. అప్పుడు చెపితే సరి. ఇప్పుడు శేషగిరికి చెప్పినా, అత్తయ్యకి చెప్పినా ఈ విషయం సుగుణకి తెలిసిపోతుంది. సుగుణ మరో యిద్దరికి చెపుతుంది. వాళ్ళు మరొకరికి - ఇంత గొడవ ఎందుకు. నాలుగు రోజులు వోపికపడితే....లాభం లేదు. నాలుగు రోజుల్లో పిరియడ్స్ వస్తాయి. ఈ రోగమేంటో తెలుసుకోవాలంటే తిరిగి నెల్లాళ్ళు ఆగాలి. అప్పుడు యింట్లో ఎవరుంటారో....నాగమణి వులిక్కిపడింది. వంటిపై శేషగిరి చెయ్యి పడగానే చేతిని పక్కకి తప్పించింది. నిద్రలో తప్పించిందనుకుని మళ్ళీ వేశాడు. తిరిగి పక్కకి దూరంగా జరిగింది.

“ఏం” అడిగాడు.

“వీలుకాదు”

"అప్పుడేనా? అప్పుడే పీరియడ్సా"

"కాదు"

"మరి"

"అది కాదు"....నాగమణి ఆగిపోయింది.

"ఏంటో చెప్పరాదా... వెధవ నీలుగు"

చెప్పేస్తే...? సంస్కారయుతంగా చెప్పాలని పదాల వెతుకులాట. కళ్ళు, ముక్కు, నోరులా అన్ని అవయవాల్లా అవయవమే అయినా మర్యాదస్తులకు నిషిద్ధ పదం కదా....ఎలా చెప్పాలి...చెపితే ఏమంటాడో!

"పీరియడ్స్‌కి నాలుగు రోజుల ముందు అక్కడ ఏదో ఒక భాగంలో వుసిరికాయంత గడ్డ వస్తుంది, సెగ్గడ్డలా. ముందు రోజు ఏ నొప్పి వుండదు. రెండో రోజు నొప్పి మొదలు. మూడోరోజు బాగా వుంటుంది. నాలుగోరోజో ఐదో రోజో పగిలిపోతుంది. నెత్తురు మాత్రం కారుతుంది. నెత్తురు గడ్డలా వుంటుందనుకోండి. అంతే తిరిగి ఏ నొప్పి ఉండదు. ప్రతి నెలా ఒకే చోట కాదు, అక్కడే ఎక్కడో ఒకచోట వస్తుంది." గబగబా చెప్పేసి ఊపిరి పీల్చుకుంది నాగమణి.

అంతా విని పడుకున్నవాడు కాస్తలేచి నిటారుగా కూర్చుంటూ "సంసారులకి వచ్చే రోగాలేనా ఇవి! బజారు ఆడాళ్ళలా ఈ రోగాలేంటి. పిల్లలు అందుకే పుట్టడం లేదనుకుంటా. ఛీ! పాడు రోగాలన్నీ ఉన్నాయా? అవ్వా! మా ఇంటా, వంటా లేవు ఇలాంటివి" అనేశాడు.

నాగమణి మనసులో బ్లోఅవుట్ మంటల్లా చివ్వున బాధ చిమ్మింది.

ఈ బాధ మొదలై నాలుగు నెలలు అయినా చెప్పలేదు. చెప్పక పోవడానికి వున్నన్ని భయాలని నిజం చేస్తూ అనాల్సిన మాటలన్నీ నిర్మొహమాటంగా అనేశాడు. బజారు ఆడాళ్ళంట! ఆడవాళ్ళ గురించి శేషగిరి యింతకంటే సంస్కారయుతంగా మాట్లాడగలడనుకోవడం తన తెలివి తక్కువతనం. ఇంటా వంటా ఇలాంటివి వున్నాయో లేవో తెలియటానికి ఈ ఇంటి ఆడవాళ్ళని ఎప్పుడైనా నోరు విప్పనిచ్చారా?

"రేపు ఎవరైనా డాక్టర్ దగ్గరికి నువ్వేపో. నీతో వస్తే పరువు పోతుంది" విసుక్కున్నాడు శేషగిరి.

తిమింగలం నోట చిక్కిన మానవశరీరంలా గిలగిలా కొట్టుకుంటోంది నాగమణి హృదయం.

సంసారులకి వచ్చే రోగమా! అంటే తనేం చేసిందని? నాగమణి ముఖాన్ని తలగడకి రుద్ది గట్టి ప్రయత్నం చేసింది దుఃఖాన్ని ఆపుకోడానికి. హృదయపు బాధ కంటిపాప ప్రవాహమైంది.

మర్నాడు ఉదయం యాభై రూపాయిల నోట్లు రెండు మంచంపై గిరాటువేసి "ఏదో ఒక డాక్టరుకి చూపించుకో. తెలిసిన డాక్టర్ల దగ్గరికి వెళ్ళొద్దు. నా పరువు పోతుంది" అన్నాడు.

ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి?

ఈ వూర్లో వున్న చాలా మంది డాక్టర్లతో శేషగిరికి పరిచయం వుంది. బ్యాంక్ ఆఫీసరుగారి భార్య కావటమూ కష్టమేలా వుంది. అతగాని పరువుపోతుందంట. టెన్నీస్ కోర్టు పరిచయాలు. క్లబ్‌లో పేకాట పరిచయాలు. బ్యాంక్ అకౌంట్‌లు. సేఫ్ డిపాజిట్ లాకర్లు - ఒక్క పరిచయమా. ఒక్క గోలా...ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి.

సెక్స్‌స్పెషలిస్ట్?! అవునూ ఎప్పుడన్నా ఎక్కడన్నా లేడీ సెక్స్‌స్పెషలిస్ట్ అని బోర్డు చూశామా? మగవాళ్ళకి వీధికో స్పెషలిస్ట్. అంటే ఆడవాళ్ళకి ఇలాంటి జబ్బులు రావనా? వచ్చినా పైకి చెప్పుకోకూడదనా? మగవాళ్ళకి ఏమొచ్చినా ఆమోదయోగ్యమే. చెప్పుకోవచ్చు. చూపించుకోవచ్చు. ఆడవాళ్ళదంతా గోప్యం....స్త్రీలు భావి భారత పౌరులని తీర్చిదిద్దే దేవతామూర్తులు అనే ప్రభుత్వ యంత్రాంగం స్త్రీల ఆరోగ్య కేంద్రాలని యమకూపాలుగానే నిర్వహిస్తుంది కదా!

పెద్ద పేరులేని చిన్న క్లినిక్‌కి వెళితే సరి. ఏ క్లినిక్?

"ఏం చేస్తున్నావ్" అడిగింది ఆ రోజు వండిన గుత్తివంకాయ కూర తీసుకొని వచ్చిన ప్రమీల.

ప్రమీలకు చెపితే? పెళ్ళయి ఈ యింటికి వచ్చినప్పట్నుంచి ప్రమీలతో పరిచయం. ఇద్దరూ కలసి గుడికి వెళతారు. నోములు నోచుకుంటారు. షాపింగ్ చేస్తారు. చీరల ఫాల్స్ కుట్టి పెట్టుకుంటారు. మొగుళ్ళు ఎత్తిపొడుపులు సాధింపులు చర్చించుకుంటారు. ఇంటి విషయాలు

మాట్లాడుకుంటారు. రెండు రోజులు ప్రమీల వూరు వెళ్ళినా, తను వెళ్ళినా, ఇద్దరికీ తోచదు. పరిచయం స్నేహంగా మారిపోవటానికి ఎక్కువ సమయం పట్టనే లేదు. ప్రమీలకి చెపితే?

"డాక్టర్ దగ్గరికి వెళ్ళాలి ప్రమీలా"

"ఏ డాక్టర్ దగ్గరికి? ఏయ్ దొంగా ఏంటి విశేషమా?" వుత్సాహంగా అడిగింది ప్రమీల.

"కాదు"

"మరి"

నాగమణి కాసేపు మౌనంగా మెల్లగా అక్షరాలు కూడబలుక్కున్నట్టు "సెగ్గడ్డల్లా వస్తున్నాయి, చూపించుకోవాలి" అంది.

నాగమణి చెప్పిన తీరు ప్రమీలకి అవి ఎక్కడ వస్తున్నాయో అర్థం అయిపోయింది.

ప్రమీల ఒక్క నిమిషం తటపటాయించి "ఇంట్లో చెప్పావా" అడిగింది.

"ఆయనతో చెప్పాను. అత్తయ్యగారికి యింకా చెప్పలేదు" అంది నాగమణి.

"అలాగా! ఆయనని తీసుకువెళ్ళమనకపోయావా?"

"ఆయన్నా? అంతా తెలిసిన డాక్టర్లేనట. పరువు పోతుందంటా" అంటూ శేషగిరి అన్నమాటలు చెప్పింది.

"గుట్టల బజారులో హెల్త్ పాలిక్లినిక్ వుంది. అక్కడికి వెళ్ళు" అంది ప్రమీల.

"నువ్వు రావా" అడిగింది నాగమణి.

"నాకు ఎక్కడ వీలవుతుంది చెప్పు. అదీకాక ఆ డాక్టరమ్మకి మా పిన్నిగారు తెలుసు" అంది ప్రమీల.

ఇటువంటి పేషెంట్‌తో వెళితే తన పరువుకి భంగమని, తనని ఎవరైనా ఏమైనా అంటారని ప్రమీల భయం.

"సరే" అంది నాగమణి.

డాక్టర్ దగ్గరికి వెళ్ళాలని నిశ్చయించుకుంది. కాని యింట్లోంచి ఎలా బయట పడాలో నాగమణికి అర్థం కాలేదు. అత్తగారు యింట్లోనే వుంది. త్వరత్వరగా పని పూర్తి చేసేసుకుని "గాంధీచౌక్ వెళుతున్నాను. పెళ్ళిలో కట్టుకున్న పట్టుచీర మీద జాకెట్ బాగా పాతదైపోయింది. ఇంకోటి తెచ్చుకోవాలి. మీ అబ్బాయికి చెప్పాను" గబగబా అనేసింది నాగమణి.

'ఇప్పుడు ఎందుకు' అని అత్తగారు ఎక్కడ అంటుందోనని శేషగిరి పర్మిషన్ కూడా వుందనే విషయమూ వినిపించేసింది. అనవసరం అనుకుంటే శేషగిరి పర్మిషన్ యివ్వడని వర్ధనమ్మగారికి బాగా తెలుసు.

"సరే వెళ్ళు" అందామె సినిమా ఛానల్ పెడుతూ.

"త్వరగా వచ్చేస్తాను" అంటూ గుమ్మం దాటింది నాగమణి. అప్పుడే గుర్తొచ్చి "ప్రమీలని తోడు తీసుకుపోరాదూ" కేకేసింది వర్ధనమ్మ.

"ప్రమీలకి ఇంట్లో పని కాలేదంట" అనేసి నొప్పిని పట్టించుకోకుండా త్వరత్వరగా రోడ్డు మీదకి అడుగులు వేసింది నాగమణి. కొంచెం దూరం నడవగానే రిక్షా దొరికింది. క్లినిక్ ముందుదిగి ఏభై రూపాయల నోటు అందించింది.

"చిల్లర లేదమ్మా" అన్నాడు.

నాలుగు దుకాణాలు తిరిగి చిల్లర తీసుకొంది. రిక్షా అతనికి డబ్బులు యిచ్చి క్లినిక్ గేటు దాటి లోపలికి వెళ్ళింది. గైనకాలజిస్ట్ అని బోర్డున్న గది ముందు బల్లలపై నెలలు నిండినవాళ్లు, నిండుతున్నవాళ్ళు, చిన్ని చిన్ని పొట్టలు వున్నవాళ్ళు, లేనివాళ్ళు, గర్భసంచి తీయించుకోబోయేవాళ్లు - పాలిపోయిన శరీరాలతో కూర్చుని వున్నారు.

వీళ్ళని చూసినవాళ్ళు ఎవరైనా మూడు రాత్రుల మాధుర్యం అంటూ కలలు కనగలరా? ఊహలు అల్లుకోగలరా?

నర్సు వచ్చిన వాళ్ళ పేరు, వివరాలు పరపరా రాసిపారేస్తోంది.

"పేరు"

ఏ పేరు చెప్పాలి? నిజం చెపితే ఏమవుతుంది? ఏం కాదు. నాగమణి పేరు వొక్క శేషగిరి భార్యకే వుంటుందా? శేషగిరి చాలమందికి తెలుసు. కాని తాను అందరికీ తెలియదుగా.

"నాగమణి"

"వయస్సు"

"ఇరవై"

"పెళ్లయి ఎన్నాళ్ళయింది"

"సంవత్సరం"

"లాస్ట్ పిరియడ్స్ డేట్"

"మార్చి 20"

"ఇంకా నెలైనా కాలేదుగా అప్పుడే ఏంటి కంగారు"

"ప్రెగ్నెన్సీ డౌట్ కాదు"

"మరింకేంటి?"

"డాక్టర్‌గారితో మాట్లాడాలి"

ఆవిడ నాగమణిని ఎగాదిగా చూసింది. మట్టెలు, నల్లపూసలు వున్నాయి. పెళ్ళి అయినట్టే వుంది. రహస్యపు అబార్షన్ గొడవ కాదు. నెల తప్పలేదంటుంది. గర్భసంచితీసే వయస్సూ కాదు. ఇంకేం జబ్బు?

"నెక్స్ట్" విసుగ్గా అరిచింది నర్సు.

నాగమణి ఆ స్త్రీల పక్కన వో బల్లపై కూర్చుంది. నిస్తేజంగా కదులుతున్నాయి శరీరాలు డాక్టరమ్మ గదిలోకి. అంతే నీర్సంగా బయటికి కాళ్ళు ఈడ్చుకుంటూ వస్తున్నారు.

నాగమణి వంతు వచ్చింది. లోపలికి వెళ్ళింది. డాక్టరమ్మని చూడగానే నాగమణికి కాస్త ధైర్యం వచ్చింది. డాక్టరమ్మకి తన రోగం గురించి ఎలా చెప్పాలని ఆలోచించిం దంతా గాలికి కొట్టుకుపోయింది. చెప్పాల్సింది చెప్పేసింది తలదించుకుని.

బల్లపై పడుకోమంది డాక్టరమ్మ.

"ఒకసారి అన్ని పరీక్షలు చేద్దాం. రిపోర్ట్స్ చూశాక మందులు రాస్తాను. మీ వారికి ఎలాంటి కంప్లైంట్స్ లేవా" అడిగింది డాక్టరమ్మ.

"ఏం చెప్పలేదు"

"అడగండి. ఆయనకి ఏమైనా ప్రాబ్లమ్ వుంటే ఒకసారి డాక్టర్‌కి చూపించు కోమనండి" అందామె.

ముప్పై రూపాయలు డాక్టరమ్మ ఫీజ్ యిచ్చి నాగమణి బయటికి వచ్చింది. నర్సు దగ్గరికి వెళ్ళి టెస్ట్‌లు ఎక్కడ చేయించుకోవాలని అడిగింది.

"ఇక్కడే, ఏవీ ఇటు ఇవ్వండి. బిల్ రాస్తాను" అందామె. నాగమణి చీటీ అందించింది. నర్సు చీటీ తెరిచి చూసింది.

వి.డి.ఆర్.ఎల్.

నాగమణి వేపు అదోలా చూస్తూ నలభై అంది.

నాగమణి ఏభై రూపాయల నోటు అందించింది. నర్సు పక్కనున్న మరో నర్సుకి ఆ చీటీని యిచ్చింది. ఇద్దరూ చీటీని చూసి ఒకరి ముఖాలని ఒకరు చూసుకొని మెల్లగా చెవులు కొరుక్కుంటున్నారు. వాళ్ళకి ఇటువంటి టెస్ట్‌లు చేయించుకునే లేడీ పేషెంట్స్ చాలా చాలా తక్కువ.

"రా" బిల్ రాయటం పూర్తయిన నర్సు అంది. నర్సు తిరిగి పది రూపాయలు యివ్వలేదు. వాళ్ళ చూపులు, మాటలకి సిగ్గుతో గొంతు పూడుకుపోయిన నాగమణికి ఆ డబ్బులు అడగడానికి నోరు పెగలలేదు. శేషగిరికి ప్రతి పైసా లెక్క చెప్పాలి. ఈ పది రూపాయల గురించి ఏం చెప్పాలి, ఎన్ని చివాట్లు తినాలోనని ఆలోచిస్తూ 'నర్సుకి యివ్వాలి కదా, మామూలంటే' అనుకొంటూ అయినా చివాట్లు తప్పవని బెంగపడుతున్నా నర్సుని ఆ డబ్బులు గురించి అడగటానికి మాత్రం సాహసించలేకపోయింది. నర్సు వెంట లేబరేటరీలోకి వెళ్ళింది.

ఆ లాబ్‌ని చూస్తేనే కడుపులో దేవినట్టయింది. ఎటు చూసినా మురికి, అశుభ్రం. సలసలా మరుగుతున్న నీటిలో సిరెంజిలు చూస్తుంటే నాగమణికి భయం వేసింది.

"డిస్పోజబుల్ సిరెంజ్‌లు వాడరా" మెల్లగా అడిగింది.

"ఇదంత పెద్ద ఆసుపత్రి కాదు. డబ్బులు ఎక్కువుంటే నీకు డిస్పోజబుల్ సిరెంజ్‌లు వాడతాం" అంది నర్సు.

"ఇస్తాను. ఎంత"

"పది రూపాయలు"

అంత ఖరీదా! అనుకుంటూ, 'పది రూపాయలు వున్నాయి కదా మీ దగ్గరా' అనబోయి, నర్సు చూపుల బాధ ఇంకా పచ్చిగా ఉండడంతో నాగమణి ఆ డబ్బు విషయం మాట్లాడకుండా మళ్లీ డబ్బులు తీసి యిచ్చింది.

బండ సూదిని రక్తం తీసుకోడానికి నరంలోకి సర్రున దింపింది నర్సు.

కెవ్వుమంది నాగమణి.

"ఎందుకలా అరుస్తున్నావ్"

"నొప్పి"

"అప్పుడు తెలియదా నొప్పి. కదలక. నీకు ఈ టెస్ట్ చాలా అవసరం" కోపమో, జాలో అర్థంకాని రీతిలో కసిరింది నర్సు.

నాగమణి చేతిలో నరం దొరకలేదు. సూదిని బయటికి లాగి "పిడికిలి బిగించు" అంది నర్సు.

"మళ్ళీనా" భయంగా అడిగింది నాగమణి.

"టెస్టుకి వచ్చినప్పుడు వున్న భయం ఆరోగ్యంపట్ల వుండాలి" అంటూ మళ్ళీ సర్రున సూది దింపి రక్తాన్ని తీసింది.

నాగమణి బుగ్గల్లోంచి వెచ్చని ఆవిర్లు. వేల వేల సూదులు శరీరంలో గుచ్చి రక్తానంతా తోడేసినట్టు నిస్త్రాణగా అయిపోతున్న శరీరంతో బయటికి వచ్చింది.

ఎందుకొచ్చింది ఈ యిన్‌ఫెక్షన్? ఎలా వచ్చింది? శేషగిరి తప్ప మరో మగవాడు తెలియదు కదా! కాని ఎలాంటి చూపులు, ఎంతెంత అసహ్యం!

'డాక్టర్ దగ్గరికి వెళ్ళావా' అని శేషగిరి అడగలేదు. ఆ రాత్రి ఇంటి పని ముగించుకుని గదిలోకి నాగమణి వచ్చే సరికి శేషగిరి మంచంపై పడుకొని తెలుగు వారపత్రికలోని శృంగార కథ చదువుతున్నాడు. అతను ఏం అడగకపోయినా చెప్పటం తన బాధ్యత అనుకొని "గుట్టల జబారులో వున్న పాలిక్లినిక్‌కి వెళ్ళాను. బ్లడ్ శాంపిల్ యిచ్చి వచ్చాను. రేపు వెళ్ళాలి" అంది నాగమణి.

శేషగిరి పుస్తకంలోంచి తల తిప్పలేదు. ఊ ఆ అనలేదు.

అతని పట్టించుకోనితనం గుండెలని ముల్లులా గుచ్చుతున్నా "మీకు ఇటువంటి బాధలు ఏమైనా వున్నాయా? ఉంటే డాక్టర్ టెస్టులు చేయించు కోమన్నారు" అంది.

"ఛీ...ఛీ....ఇంటావంటాలేని చీడంతా నువ్వు పట్టుకొచ్చి తిరిగి నాకు వున్నాయేమోనని అడుగుతున్నావా? మతి వుండే మాట్లాడుతున్నావా? నాకేం రోగం లేనప్పుడు నీకు రోగం ఎలా వచ్చింది? ఎక్కడ నుంచి వచ్చింది. నువ్వు చెప్పినప్పటి నుంచి అదే ఆలోచిస్తున్నా. ఇంకా ఎక్కువ ఆలోచిస్తే నేనేం అయిపోతానో నాకే తెలియదు. ఏం రోగమో ఏమో వేరే పడుకో" ఎడాపెడా అనేశాడు శేషగిరి.

నాగమణి సిగ్గుతో అవమానంతో కుంగిపోయింది.

మర్నాడు అత్తగారికి మరో నాలుగు అబద్ధాలు చెప్పి డాక్టర్ దగ్గరికి బయలు దేరింది.

నర్సుని అడిగి రిపోర్ట్ కవర్ తీసుకొని తనవంతు రాగానే డాక్టర్ గదిలోకి వెళ్ళింది. కవర్ డాక్టర్‌కి అందించి తలొంచుకొని ముడుచుకుపోయిన మనసుతో కూర్చుంది.

డాక్టర్‌గారు కవర్‌లోంచి కాగితం తీసి చూసి "నెగిటివ్ రిపోర్ట్, సో అటువంటి డిసీస్ ఏం కాదు. మందులు రాసి యిస్తాను. వాడండి. తగ్గిపోతుంది. తగ్గకపోతే తిరిగి ఆలోచిస్తాను" అన్నారు.

నాగమణి తలెత్తింది. తేటపడిన కళ్ళు, స్పష్టమైన స్వరంతో "ఎందుకొచ్చినట్టు" ప్రశ్నించింది.

"చిన్న ఇన్‌ఫెక్షన్ అయి వుంటుంది. మెన్సస్ అప్పుడు వాడే క్లాత్ కావొచ్చు. ఇది వాడి చూద్దాం" అన్నారామె.

"థాంక్యూ" అంటు నాగమణి గదిలోంచి బయటికి వస్తుంటే నర్సు కనిపించింది కౌంటర్ దగ్గర.

"నిన్న మీరు పది రూపాయలు ఇవ్వాలి. ఇస్తారా" జీవమున్న స్వరంతో నర్సుని అడిగింది నాగమణి.

"నిన్నా" గుర్తున్నా లేనట్టే అడిగింది నర్సు.

"అవునండి"

నర్సు ఏం అనలేక డబ్బులు యిచ్చింది.

నాగమణి మందులు కొనుక్కుని యింటికి వచ్చింది. అత్తగారి కళ్ళలో పడకుండా మందులు లోపల పెట్టింది. తనది గోప్యంగా వుంచాల్సిన రోగం కాకపోయినా యిన్ని రోజులు చెప్పలేదు కదా. అత్తగారు ఏమైనా అంటారని నాగమణి భయం.

నాగమణి సాయంత్రం స్నానం చేసి నేత చీర కట్టుకొని పువ్వులు పెట్టుకొంది. గుండెల్లో బరువు దిగిపోవటంతో హుషారుగా కూనిరాగాలు తీస్తూ పనులు చేసుకొంటు శేషగిరి కోసం ఎదురు చూస్తోంది.

శేషగిరి వచ్చాడు. స్నానం చేశాడు. అన్నం తిన్నాడు. టి.వి. ముందు కూర్చున్నాడు. శేషగిరికి ఎప్పుడు తన విషయం చెపుదామాని నాగమణి ఆత్రుతగా ఎదురు చూస్తుంది. టి.వి. ఆపి శేషగిరి గదిలోకి వచ్చాడు. మంచంపై పడుకుంటు చేతికి అందిన పుస్తకం తీసుకున్నాడు.

నాగమణి మంచం చివర కూర్చుంటూ "డాక్టర్ దగ్గరికి వెళ్ళాను కదా. బ్లడ్ టెస్ట్ చేశారుగా, ఏం లేదంట" అంది.

శేషగిరి 'వూ, ఆ' అనలేదు.

"వింటున్నారా" తిరిగి అడిగింది నాగమణి

"ఆ వింటున్నా? నువ్వూ విను. నీకీ రోగం ఎక్కడ నుంచి వచ్చింది. ఎవడు వాడు?"

నాగమణికి శేషగిరి ప్రశ్న అర్థం అవుతూనే గుండెని మంచు కత్తితో కోసినట్టు మనసంతా మొద్దుబారిపోయింది.

"నాకా?....ఎ...వ్వరితో ఏం లేదు. అయినా....అయినా నాకేంలేదని డాక్టర్ చెప్పారుగా. కావలిస్తే రిపోర్ట్ చూడండి" నోరు తడి ఆరిపోతుంటే మెల్లగా అంది.

"ఎవ్వడికి కావాలి ఆ రిపోర్ట్. నువ్వు వో రోగాల పుట్టవి. అందుకే నీకు పిల్లలు పుట్టలేదు. నమ్మించాలని ప్రయత్నించకు. నీ ముఖం చూపించకు. నన్ను రెచ్చగొట్టకు. నీకు నాకు ఏ సంబంధంలేదు. పో యిక్కడ నుంచి" అన్నాడు శేషగిరి.

నాగమణి మెల్లగా తేరుకుంటూ "డైవోర్సా?" అంది.

"ఏంటి? డైవోర్సా? ఇంకా ఆ మోజు తీరాలా? నువ్వు నన్నేం అడగొద్దు. నీకు నాకు ఏ సంబంధం లేదు. ఎలా చెప్పాలో ఏం చెయ్యాలో నాకు తెలుసు. నోరు మూసుకో" కసిరాడు శేషగిరి.

"ఇందులో నా తప్పేం వుంది. నాకు మీరు తప్ప మరెవ్వరూ తెలియదు. నాకే రోగం లేదని డాక్టర్ చెప్పారుగా! ఇంకా మీ అనుమానం ఏంటి?" నిలదీసింది నాగమణి.

"ఏం లేదా? లేకపోతే నీకు వున్న రోగం ఏంటి? పైగా అరుస్తున్నావ్" చికాకు పడ్డాడు శేషగిరి.

'శరీరంలో ఏ భాగంలో నొప్పి వచ్చినా ఎంతో కొంత ఆదరం, కనికరం, కన్సిడరేషన్. కాని ఆ భాగంలో అస్వస్థత రాగానే ఏకాకిగా నిలబడాల్సి వచ్చిందే. ఇదే శేషగిరికి వస్తే? డాక్టర్ దగ్గరికి వెళ్ళడానికి ఇంత సిగ్గుపడే వాడా? అతనితో అతని స్నేహితులు తన స్నేహితురాలిలా ప్రవర్తించేవారా? కన్నతల్లికి కూడా చెప్పలేక తనలాగ కుమిలి పోయేవాడా? అసలు ఇంత వ్యధని అనుభవించేవాడా? అందరి విషయం వదిలేస్తే అతనితో ఇలాగే తను ప్రవర్తించేదా? ఒక్క మాటైనా అని వుండేదా? తన శరీరాన్ని అతనికి అప్పగించకుండా ఉండేదా? అతను మగవాడు కదా. అన్నీ చెల్లుతాయి. తను స్త్రీ కదా. పుట్టటం, పెరగటం, పెళ్ళి, శోభనం, పిల్లలు, ఆరోగ్యం, విడాకులు - ఏమైనా ఏ విషయమైనా తప్పని ఒంటరి పోరాటం....ఎస్. తనూ పోరాడుతుంది' రెప్పలార్పకుండా శేషగిరిని చూస్తూ అనుకొంది నాగమణి.